క్లుప్తంగా

మహిళా ఉద్యోగుల ఫిర్యాదుపై ఆర్డీఓ విచారణ

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఓ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని ఇద్దరు మహిళా ఉద్యోగులు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ అధికారిగా ఆర్డీఓ గోపీరామ్‌ను నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్డీఓ మార్కెట్‌కు వచ్చి ఫిర్యాదుపై ఆరాతీశారు. సదరు మహిళా ఉద్యోగులను పిలిపించి, ఫిర్యాదుకు సంబంధించి వివరాలను తీసుకున్నారు. మార్కెట్‌లో జరిగిన విచారణకు సంబంధించిన నివేదికను ఆర్డీఓ కలెక్టర్‌కు అందజేయనున్నారు.

చలివేంద్రం ప్రారంభం



జనగామ: వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న దృష్ట్యా జనగామ చౌరస్తా పోలీసు కంట్రోల్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీపీ రాజమహేంద్ర నాయక్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే కానిస్టేబుళ్లకు ఎండ వేడిమికి రక్షణ కవచంగా ఉపయోగపడే హెల్మెట్లతో కూలింగ్ అద్దాలను డీసీపీ అందజేశారు. సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు రాజేష్, చెన్నకేశవు లు, రాజన్‌బాబు ఉన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



రాజేందర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే

జనగామ రూరల్: అంకిత భావంతో పని చేస్తే సమాజం గుర్తిస్తుందని ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంఈఓ వంగాల రాజేందర్ పదవీ విరమణ అభినందన సన్మాన కార్యక్రమం పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ జనగామ జిల్లా బాధ్యులు పన్నీరు రవీందర్ ఆధ్వర్యంలో ఎస్ఎంఆర్ గార్డెన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై వారిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కాగా, పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ సభ్యులు దామోదర్‌రెడ్డి, కిషన్ రెడ్డిలు రాజేందర్‌ని ఆత్మీయ సన్మానోత్సవ పత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె.మహిపాల్ రెడ్డి, టీఆర్ఎస్ఎంఏ జిల్లా అధ్యక్షుడు పప్పు వెంకట్ రెడ్డి, టీఎస్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఖాజా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్మెట: బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత కోఆర్డినేటర్, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు నీరటి సుధాకర్ తండ్రి నీరటి ఆగయ్య (102) మంగళవారం మృతిచెందారు. కాగా ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఆగయ్యకు నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రమాదాల నివారణకు ప్రజల తోడ్పాటు కీలకం



దేవరుప్పుల: రోడ్డు ప్రమాదాలు, నేరాల నివారణకు ప్రజలు తోడ్పాటు కీలకమని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులు, జనగామ–సూర్యాపేట రహదారిలో ప్రమాదాల నివారణ హెచ్చరిక బోర్డుల ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గత ఏడాదిలో సర్కిల్ పరిధి రహదారిలో 47 మంది రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం పొందారని వెల్లడించారు. రహదారిలోని బస్‌స్టేజీల వద్ద వాహనదారులు వేగపరిమితి తగ్గించాలని, ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని సూచించారు. వేసవిలో ప్రజలు తమ ఇంటికి తాళాలు వేసి వెళ్లే క్రమంలో విలువైన వస్తువులు తమ ఇంట్లో ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్సై ఊర సృజన్‌కుమార్, ఏఎస్సై సదానందం, హెచ్‌సీ సదయ్య పోలీసు సిబ్బంది యాకేష్, ప్రవీణ్, దామోదర్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కొడకండ్ల: కడగుట్టతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు భూక్య శ్రీనునాయక్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని ఆశ్రయించారు. కాగా, సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.25,500 చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ మంగళవారం శ్రీనునాయక్‌కు అందజేశారు.

మొరాయిస్తున్న సర్వర్

- పనిచేయని ధరణి పోర్టల్
- ఇబ్బందుల్లో వినియోగదారులు

తరిగొప్పుల: వారం రోజులుగా ధరణి పోర్టల్ సర్వర్ మొరాయిస్తుండంతో వ్యవసాయం భూమి క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ లాగిన్ కావడంలో సమస్య ఉండడంతో స్లాట్ బుక్‌చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సాంకేతిక సమస్యతో వారం రోజులుగా ధరణి పోర్టల్ పనిచేయకపోవడంతో మండలంలో దాదాపు 25 భూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రిజిస్ట్రేషన్ కోసం దూరప్రాంతాల నుంచి కార్యాలయం తెరువకముందే వేచియున్న వినియోగదారుడికి ధరణి ఆపరేటర్ సర్వర్ పనిచేయడంలేదని తెలుపుతుండడంతో



వినియోగదారుడి ఫొటో క్యాప్చర్ చేస్తున్న ఆపరేటర్

సాయంత్రం వరకు ఉన్నా రిజిస్ట్రేషన్ కాకపోడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. చేసేది లేక ధరణి ఆపరేటర్ వినియోగదారుల వేలి ముద్ర, ఫొటో క్యాప్చర్ చేసుకుని పంపించేస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ధరణి పోర్టల్ పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థినులకు నగదు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

లింగాలఘణపురం: కుందారం ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఎండీ రిజ్వానాకు రూ.2,116, రెండో ర్యాంక్ సాధించిన ముగ్గురు విద్యార్థులు ఓరుగంటి కావ్య, ఉషశ్రీ, అనంతోజు మానసలకు ఒక్కొక్కరికి రూ.1,116లు వాసవి క్లబ్ పూర్వాధ్యక్షుడు దారం అశోక్ నగదు పురస్కారం అందజేశారు. హెచ్‌ఎం రవిశంకర్, వాసవి క్లబ్ అధ్యక్షుడు శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి రమేష్, సభ్యులు వెంకన్న, కిశోర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరిని విమర్శిస్తే గ్రామాల్లోకి రానివ్వం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు

రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్‌రెడ్డితో నియోజకవర్గంలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించిన అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నిరాధార ఆరోపణలు మానుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి హెచ్చరించారు. అలాగే వ్యవహరిస్తే గ్రామాల్లోకి రాజయ్యను రానివ్వబోమని పేర్కొన్నారు. మంగళవారం ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో వారు వేర్వేరుగా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సభ సక్సెస్ కావడంతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మతిభ్రమించి వ్యాఖ్యలు చేస్తున్నాడని అన్నారు. కనీస అవగాహన లేకుండా కేసీఆర్ మెప్పు పొందేందుకు కడియంపై రాజయ్య విమర్శలు చేయడం సిగ్గు చేటని, ఇప్పటికైనా బుద్ధి మార్చుకుని అభివృద్ధికి సహకరించాలని, లేనిపక్షంలో



రఘునాథపల్లి: మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

రానున్న రోజుల్లో ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు. సీఎం సభకు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా సమావేశాల్లో కాంగ్రెస్ రఘునాథపల్లి మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి, మేకల నరేందర్, కావటి భాస్కర్‌యాదవ్, నామాల బుచ్చయ్య, గొట్టం భాస్కర్‌రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, చింత ఎల్లయ్య, బూర్ల శంకర్, కొలిపాక సతీష్, రాములు, కిరణ్, సారంగపాణి, రాజు, శ్రీనివాస్, బాబు, వేణు, విజయ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా అమలు చేయాలి

- ఎస్సీ వర్గీకరణ బిల్లుపై అసెంబ్లీలో ప్రసంగించిన ఎమ్మెల్యే కడియం



స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీల వర్గీకరణ అంశంపై స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం అసెంబ్లీలో ప్రసంగించారు. ఎస్సీల వర్గీకరణపై ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును వెంటనే దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం దళితుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపే ప్రయత్నం చేస్తుందన్నారు. దళిత సామాజికవర్గం మొత్తం కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అండగా ఉంటుందన్నారు.

రిజర్వాయర్లకు నిధులు కేటాయించండి



పాలకుర్తి టౌన్: నియోజకవర్గ సమస్యలపై పాలకుర్తి ఎమ్మెల్యే గళమెత్తింది. సాగునీరు, రవాణా, కొత్త మండలాల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించింది. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం నియోజకవర్గపరిధిలోని గల సమస్యలపై జీరో అవర్ (ప్రశ్నోత్తరాల సమయం) ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడారు.

స్వయంపాలన దినోత్సవం



విద్యాబోధన చేస్తున్న విద్యార్థులు

దేవరుప్పుల: మాధాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఉదయం ప్రార్థన మొదలు, కార్యాలయంలో సమావేశం, తరగతుల నిర్వహణ చేపట్టారు. హెచ్‌ఎం నల్ల లలిత పర్యవేక్షణలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీ 15వ వార్డులో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు చింత జాకబ్, రాజారపు దేవయ్య, గుర్రం యేసయ్య మాట్లాడారు. స్థానిక విద్యాజ్యోతి కళాశాల వెనుక వైపు ఉన్న 15వ వార్డులో గత ఐదేళ్లుగా డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. డ్రెయినేజీ నీరు బయటికి వెళ్లేందుకు మార్గం లేక ఇళ్ల ఎదుట మురుగునీరు నిలుస్తోందని, తద్వారా దుర్వాసన, ఈగలు, దోమలతో అనునిత్యం అవస్థలకు గురవుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్యపై గత గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్డీఓకు, సర్పంచ్‌కు వినతిపత్రం అందించామన్నారు. ప్రస్తుతం స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా మారినా సమస్య తీర్చడం లేదని, మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా స్పందన లేదన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీవాసులు

మురుగునీరు, దోమలతో కాలనీవాసులు జ్వరాల బారిన పడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. లేనిపక్షంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో చింత రత్న, మరియ, సుధాకర్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంతో బంగారు భవిష్యత్



ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న శివరాజ్

ఏఎంసీ చైర్మన్ శివరాజ్ యాదవ్

జనగామ: తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి.. రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభించారని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. నూతనంగా అమలు చేసిన స్కీంను స్వాగతిస్తూ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గంగం నర్సింహరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, రాజబోయిన లక్ష్మి నారాయణ, గాదెపాక రామచంద్రం, తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలి



మాట్లాడుతున్న డీటీడీఓ ప్రేమకళ



చిల్పూరు: విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

- డీటీడీఓ ప్రేమకళ

జనగామ రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని డీటీడీఓ ప్రేమకళ అన్నారు. జనగామ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. సామజిక విద్యావేత్త భాష్యం శేషాద్రి, హెచ్‌ఎం జె.లచ్చిరాం, స్టాఫ్ సెక్రటరీ బి. వాసు, హరిచంద్ తదితరులు ఉన్నారు.

కీర్తి పెంచాలి

లింగాలఘణపురం: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల కీర్తి పెంచాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీత కోరారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడారు.

తిడుగులో..

జఫర్‌గఢ్: టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుందూరు సుధాకర్ కోరారు. తిడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడారు. అనంతరం ఓ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పల్లె రాజిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కాగా, కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పీఎంశ్రీ కార్యక్రమం ద్వారా కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. హెచ్‌శ్రీం ఎండీ పర్వేజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్ తొలిమెట్టు

చిల్పూరు: పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఇంటర్ తొలిమెట్టు లాంటిదని హెచ్‌ఎం సముద్రాల శ్రీదేవి అన్నారు. లింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జామెట్రీ బాక్కులను విద్యార్థులకు అందజేశారు.

వర్ధిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

విద్యాభివృద్ధి కోసం వర్ధిని ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యాన నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇల్లందుల విజయ్ సమక్షంలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఎస్సై వినయ్‌కుమార్ అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ..

స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో వర్ధిని ఫౌండేషన్ వారి సహకారంతో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఇల్లందుల విజయ్, పార్టీ నాయకులు సంపత్‌రాజ్ ఆధ్వర్యంలో కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

సీజేఐటీలో డిజైనింగ్ ఆఫ్ సోలార్ పీవీ సిస్టంపై శిక్షణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి

జనగామ: మండలంలోని యశ్వంతాపూర్ క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో డిజైనింగ్ ఆఫ్ సోలార్ పీవీ ఫొటో వోల్టాయిస్ సిస్టంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం శిక్షణకు ముఖ్యఅతిథిగా హాజరైన గ్రీన్ వియాన్ వర్కింగ్ మేనేజర్ పురుషోత్తమ్ చారీ సోలార్ ఎనర్జీ విశిష్టత, ఉపయోగాలు, ప్యానెల్ ఇన్‌స్టాల్ చేయడం ద్వారా కలిగే ఉపయోగాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా విభాగాల కన్వీనర్లు సరిత, కరుణాకర్ పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలి

రఘునాథపల్లి: విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, విద్యను అసక్తిగా అభ్యసిస్తూ ఉన్నతస్థాయికి చేరుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భారత రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాంబాబు మాట్లాడారు. ప్రముఖ వైద్యుడు రమేష్‌బాబు సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. అలాగే 5ఈ వ్యవస్థాపకుడు నర్సింహరాజు రిటైర్డ్ డీఈఓ జీవన్, ఎంఈఓ రఘునందన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆందోళనలు అనివార్యం

బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సుందర్‌రామిరెడ్డి

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరితో పేరుకపోతున్న రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు అనివార్యమని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల కేంద్రంలో తలపెట్టిన వరి పంట నష్ట పరిహారం, తదితర సమస్యలపై ధర్నా విజయవంతం కోసం మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు శాపంగా మారిందన్నారు. ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బస్వమల్లేషం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంసింగ్, ,ప్రధాన కార్యదర్శి చింత రవి, మాజీ ఎంపీపీ కొల్లూరి సోమయ్య, అధికార ప్రతినిధి హనుమంతు, సీనియర్ నాయకులు ఈదునూరి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుందర్‌రామిరెడ్డి

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న సుందర్‌రామిరెడ్డి

జనగామ రూరల్: జిల్లా సాధన ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా సాధన ఉద్యమం కేసులో ఉద్యమకారులు జిల్లా కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. కోర్టుకు హాజరైన వారిలో మాజీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, మంగళంపల్లి రాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, సతీష్ ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'రాజీవ్ యువ వికాసం పథకం' ప్రకటించిందని, ఈ పథకానికి నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల కార్య నిర్వాహక సంచాలకులు ఎస్.మాధవీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి కల వారు ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవలని సూచించారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

యాదగిరిగుట్టకు తరలిన భక్తులు

జనగామ: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో గిరి ప్రదక్షిణ కోసం మంగళవారం జిల్లా నుంచి వందలాది మంది భక్తులు తరలివెళ్లారు. ధర్మపురి శ్రీనివాస్, చింతకింద మల్లేశం, బండ వేణు, వినయ్, వేముల శంకర్, ఒరుగంటి అంజనేయులు తదితరులు ఉన్నారు.

100 గ్రాముల గంజాయి పట్టివేత

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారులోని తాటికొండ క్రాస్‌రోడ్డు వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి స్థానిక పోలీసులు 100 గ్రాముల గంజాయిని మంగళవారం పట్టుకున్నారు. స్థానిక తాటికొండ క్రాస్‌రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై ఇద్దరు యువకులు అనుమానస్పదంగా కనిపించగా బైక్‌ను తనిఖీ చేశారు. అందులో వంద గ్రాముల గంజాయిని గుర్తించారు. గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ దాదాపు రూ.6వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా నిందితులను బుధవారం రిమాండ్‌కు పంపనున్నట్లు సమాచారం.

చిరు వ్యాపారుల నుంచి రుసుం తీసుకోవద్దు

రఘునాథపల్లి: రఘునాథపల్లిలో ప్రతి గురువారం జరిగే గొర్రెలు, మేకల అంగడిలో కూరగాయలు, ఇతర నిత్యావసరాలు విక్రయించే చిరు వ్యాపారుల నుంచి కాంట్రాక్టర్ డబ్బులు తీసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ గణేష్‌సింగ్ కోరారు. ఈ మేరకు మంగళవారం డీఎల్‌పీఓకు వినతి పత్రం అందజేశారు. వినతికి డీఎల్‌పీఓ సానుకూలంగా స్పందించినట్లు గణేష్‌సింగ్ తెలిపారు.

హర్షణీయం

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం సర్వత్రా హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీసీ నాయకులతో కలిసి ఆయన మంగళవారం మాట్లాడారు.

విద్యుత్ ఉద్యోగులకు రాష్ట్రస్థాయి అవార్డు

జఫర్‌గఢ్: ట్రాన్స్‌కో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ జెన్‌కో ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన విద్యుత్ ఉద్యోగులు బలిబండా నాటక ప్రదర్శనను నిర్వహించి ద్వితీయ బహుమతిని సాధించారు. ఈ మేరకు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ముషారఫ్ అలీ ఫారుక్వీ చేతుల మీదుగా మంగళవారం బహుమతి అందుకున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

బచ్చన్నపేట: ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొడవటూర్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్‌వీఎం ఆస్పత్రి గజ్వెల్ వారితో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు గ్రామస్తులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. పూర్వ రీజియన్ చైర్మన్ ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, పూర్వ జోనల్ చైర్మన్ జిల్లా రాజేశ్వర్, కార్యదర్శి మూసిని రాజుగౌడ్, పంచాయతీ కార్యదర్శి బ్యాంగి రూపాచైతన్య, డాక్టర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఈజీఎస్ పనులతో కూలీలకు ఉపాధి



పాలకుర్తి: ఈజీఎస్ పనులతో కూలీలకు ఉపాధి లభిస్తుందని ఎంపీడీఓ రాములు అన్నారు. మంగళవారం పలు గ్రామాల్లో చేపట్టిన పనులను ఎంపీఓ రవీందర్, ఈజీఎస్ ఏపీఎం మంజులతో కలిసి సందర్శించారు. ఈజీఎస్ పనులకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలి

జఫర్‌గఢ్: సాగరం, తమ్మడపల్లి (జి) గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యాన నాయకులు, కార్యకర్తలు ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఎండీ షబానా, మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, వడ్లకొండ సుధాకర్ మాట్లాడారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీడీ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌ఆర్ ఈసీఎస్ నిధులతో ప్రతీ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని తెలిపారు. టౌన్ అధ్యక్షుడు కొడూరి మహాత్మాచారి, నాయకులు దాచేపల్లి రాజయ్య, నర్సింగారావు, అల్వాల ఎల్లయ్య, మచ్చ సుధాకర్, కొండ హరికృష్ణ, మల్లేశం, అభివర్మ పాల్గొన్నారు.

దూడను చంపిన హైనా

జఫర్‌గఢ్: వ్యవసాయ బావి వద్ద ఉన్న దూడపై హైనా దాడి చేసి చంపిన సంఘటన మండలంలోని ఉప్పుగల్లులో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. ఉప్పుగల్లుకు చెందిన రైతు శివరాత్రి కొమురయ్య తన వ్యవసాయ బావి వద్ద గేదెలను పోషిస్తున్నాడు. సోమవారం రాత్రి పశువులను కొట్టంలో కట్టి వేసి మొక్కజొన్న చేనుకు నీళ్లు పెట్టేందుకు కొమురయ్య బావి వద్దనే ఉన్నాడు. తెల్లవారుజామున గేదెలకు పాలుపితికి ఇంటికి తీసుకు వచ్చాడు. గంట తర్వాత తిరిగి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా అప్పటికే హైనా దాడిలో చనిపోయిన దూడ కళేబరాలు కన్పించడంతో ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. రైతులు అప్రమత్తంగా ఉంటున్న కూడా ఉదయాన్నే కొమురయ్యకు చెందిన దూడపై హైనా దాడి చేసి చంపి తినడంతో స్థానికులు భయందోళనకు గురవుతున్నారు. దీంతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. ఫారెస్టు అధికారులు వెంటనే చర్యలు చేపట్టి హైనా బారి నుంచి పశువులను కాపాడాలని వారు కోరుతున్నారు.

20న కంటి వైద్యశిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఘన్‌పూర్ స్టేషన్, శివునిపల్లి సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ శరత్ మాక్స్ విజన్ సహకారంతో ఈనెల 20వ తేదీన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు శివునిపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి తెలిపారు. ఘన్‌పూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. స్థానిక పాత గాంధీ చౌరస్తా సమీపంలోని మమత హాస్పిటల్ వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందన్నారు. శిబిరంలో పరీక్షలు చేసి కంటిలో దుర్మాంసం పెరిగిన వారికి హనుమకొండ శరత్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. నేత్ర సమస్యలు ఉన్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీకార్డుతో శిబిరానికి రావాల్సిందిగా ఆయన సూచించారు.

'సీఎం వ్యాఖ్యలు సరికాదు'

పాలకుర్తి: సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులపై చేస్తున్న వ్యాఖ్యలు సరైనవి కావని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంబంధించిన డీఏల చెల్లిస్తామని, పీఆర్‌సీని అమలుచేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మర్చిపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినప్పటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు.